గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జిల్లా పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో గవర్నర్‌తో జిల్లా అధికారులు, జిల్లాలోని కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలు, ప్రముఖుల ముఖాముఖీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలో అమలు అవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించి, కలెక్టరేట్ కార్యాలయాన్ని సుందరంగా ముస్తాబు చేయాలని, జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


అలంకరించిన సమావేశ మందిర ప్రవేశ ద్వారం

యాదాద్రీశులకు భక్తుల ఆర్జిత ఆరాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో బుధవారం స్వయంభువులైన పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన నిత్యపూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరిచి మూలవరులను హారతితో కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసీపత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణ మూర్తులకు బంగారు పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ సువర్ణ పుష్పార్చన క్రతువులు కొనసాగించారు. ఉగ్రనహరిని శాంతింపజేసేందుకు శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించారు. లోక కల్యాణార్థమై శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం పాంచరాత్రాగమ ఆచారంగా చేపట్టారు.


శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణపర్వం

సన్నాల కొనుగోళ్లలో సాంకేతికత


రేణికుంట శివారులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు (పాతచిత్రం)

◆ కేంద్రాల్లో పారదర్శకతకు అవకాశం

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గతంలో కంటే భిన్నంగా రాష్ట్ర సర్కారు ఈ సారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. ఇందుకు ప్రత్యేక కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా సాంకేతికత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత కేంద్రాలకు ఆయా సాంకేతిక పరికరాలు వచ్చి చేరాయి. వీటి ద్వారా సన్నరకం ధాన్యం తేమ, తాలు, గింజల పరిమాణం తదితర అంశాలను సులువుగా తెలుసుకునే వీలు కలుగుతుంది.

గింజలు తీయడానికి 'ప్యాడి హస్కల్'..

శాఖాపరంగా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు ప్యాడి హస్కల్ యంత్రాలను అందజేయనున్నారు. గుప్పెడు వడ్లు తీసుకుని ఈ యంత్రంతో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఈవిధంగా బయటకు వచ్చిన బియ్యం గింజలను గ్రెయిన్ కాలిపర్ యంత్రంలో పోసి సన్నరకం బియ్యం అవునో.. కాదో.. తెలుసుకునే వీలు కలుగుతుంది.

'గ్రెయిన్ కాలిపర్'తో గుర్తింపు..

సన్నధాన్యం గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రో మీటర్) యంత్రం అందజేస్తున్నారు. ఈ యంత్రం సాయంతో సన్నబియ్యం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు. ఈ యంత్రం వినియోగంపై కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించినట్లుగా సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి.

సంచులపై కోడ్..

ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రం కోడ్, ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్న రకమైతే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'ఎస్' అని రాస్తారు. దొడ్డు రకం సంచులపై ఆకుపచ్చ రంగుతో కొనుగోలు కేంద్రం నెంబరు, ధాన్యం రకం వద్ద 'డీ' అని రాస్తారు. సన్న రకాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

సంబంధిత రైతుల ఐరిస్..

రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని నిలువరించేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానం అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయ సమయంలో మరోసారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను కేటాయించిన మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకుని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో సంబంధిత రైతు ఐరిస్ తీసుకోనున్నారు.

ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యం సాగు వివరాలు ఎకరాల్లో.. (అంచనా)

సన్నరకం సాగు	జిల్లా	దిగుబడి
2,42,490	నల్గొండ	5,81,975
3,41,650	సూర్యాపేట	8,15,960
97,028	యాదాద్రి	1,74,650

ఈ రకాలకే పంట బోనస్

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు రైతుల్లో ఉన్నాయి. సర్కారు గుర్తించిన సన్నరకం వంగడాలు ఇవే.

సాంబమసూరి(బీపీటీ-5204)	జగిత్యాల సన్నాలు(జేజీఎల్-1798)
సిద్ధి(డబ్ల్యూజీఎల్-44)	జగిత్యాల సాంబ(జేజీఎల్3844)
కంపసాగర్-1(కేపీఎస్-2874)	కరీంనగర్ సాంబ(జేజీఎల్-3855)
జగిత్యాల-3(జేజీఎల్--27356)	అంజన(జేజీఎల్-11118)
జగిత్యాల-2(జేజీఎల్-28545)	నెల్లూరు మసూరి(ఎన్ఎల్ఆర్-34449)
వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్-14)	ప్రత్యూమ్న(జేజీఎల్-17004)
వరంగల్ సన్నాలు(డబ్ల్యూజీఎల్-32100)	సుగంధ సాంబ(ఆర్ఎన్ఆర్-2465)
జగిత్యాల మసూరి(జేజీఎల్-11470)	శోభిని(ఆర్ఎన్ఆర్-2354)
పలాస ప్రభ(జేజీఎల్-384)	సోమనాథ్(డబ్ల్యూజీఎల్-347)
కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)	ఆర్ఎన్ఆర్-31479(పీఆర్ఫ్)
మానేరు సోనా(జేజీఎల్-3828)	కె.పీ.ఎస్-6251(పీఆర్ఫ్)
తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్-15048)	జేజీఎల్-33124(పీఆర్ఫ్)
వరంగల్ వరి-1119	హెచ్ఎంటీ సోనా
కూనారం వరి-2(కేఎల్ఎం-1638)	మారుటేరు సాంబ(ఎంటీయూ-1224)
వరంగల్ వరి-2(డబ్ల్యూజీఎల్-962)	మారుటేరు మసూరి(ఎంజీయూ-1262)
రాజేంద్రనగర్ వరి-4(ఆర్ఎన్ఆర్-21278)	ఎంటీయూ-1271
కూనారం వరి-1(కేఎల్ఎం-733)	

యాదాద్రిలో.. కార్తిక మాసోత్సవాలకు సన్నాహాలు


యాదగిరిగుట్టలో వ్రత మండపం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: హరిహరులకు ప్రీతికరమైన మాసం కార్తికం. వైష్ణవ, శైవ ఆరాధకులు అత్యధిక సంఖ్యలో హరి, హరులను దర్శించుకొని పూజలు చేపడతారు. పుణ్యస్నానం, దీపారాధన, తులసీ పూజ, శ్రీసత్యనారాయణస్వామి వ్రత నిర్వహణతో పాటు ప్రదక్షిణ మొక్కులు తీర్చుకుంటారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమే అయినా.. యాదాద్రిలో శివాలయం నిత్య పూజలతో శైవ ఆరాధకులకు ఆధ్యాత్మికతను అందిస్తోంది. వచ్చే నెల 2 నుంచి మొదలయ్యే కార్తిక మాసోత్సవాల నిర్వహణకు హరిహర క్షేత్రమైన యాదాద్రి వివిధ ఏర్పాట్లతో సంసిద్ధమవుతోందని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

పుణ్యస్నానాలు..

కార్తిక ఆరాధనలో పాల్గొనేందుకు ముందస్తుగా భక్తులు పుణ్యస్నానాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ఇందుకు కొండకింద లక్ష్మి పుష్కరిణిలో అవసరమయ్యే వనరుల ఏర్పాట్లు చేపట్టేందుకు దేవస్థానం సివిల్ విభాగం బాధ్యత వహించనుంది. కిండపైన విష్ణు పుష్కరిణిలో దంపతుల స్నాన సంకల్పానికి ఏర్పాట్లు చేశారు.

★ కార్తిక దీపారాధనకు కొండపైన ప్రధాన ఆలయ మాడ వీధిలో, శివ సన్నిధితో పాటు కొండకింద లక్ష్మి పుష్కరిణి చెంత నిర్వహణకు ఏర్పాట్లు త్వరలోనే చేపడతారు.

సామూహిక వ్రతాలు..

యాదాద్రి క్షేత్రంలో సామూహికంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల నిర్వహణకు కొండకింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపాన్ని తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయి. 600 వ్రత పీటలను సిద్ధం చేస్తున్నారు. వ్రత మండపం వద్ద సిమెంట్ ఫ్లోరింగ్, టైల్స్ వేసే పనులను వైటీడీఏ ద్వారా చేపట్టారు. ఇంకా అవసరమయ్యే వనరుల కల్పనకు నిర్ణయించారు.


అన్న ప్రసాదం..

క్షేత్రసందర్శనకు వచ్చే భక్తులకు స్వామి అన్నప్రసాదం నూతన భవనంలో కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం వెయ్యి మందికి అందజేస్తున్న అన్నప్రసాదాన్ని కొత్త భవనంలో మరో వెయ్యి మంది భక్తులకు పెంచి నిత్యం రెండు వేల మంది భక్తుల ఆకల్ని తీర్చేందుకు దేవస్థానం నడుం బిగిస్తోంది.

★ ప్రసాదాల కొనుగోలుకు భక్తులు ఇక్కట్లు పడకుండా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొండపై బస్‌స్టేషన్, కొండ కింద ఆధ్యాత్మిక వాడలోని బస్టేషన్‌లో కౌంటర్లు ఏర్పాటవుతాయి.

రవ్వంత పెట్టుబడి.. కొండంత రాబడి

❏ పేట కేంద్రంగా గొలుసుకట్టు దందా..!



సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే:

ఒక్కసారి పెట్టుబడి పెట్టండి.. వారం.. వారం.. ఏడాది పాటు కావాల్సినన్ని డబ్బులు పొందండి. మీరు చేయాల్సిందల్లా మేం సూచించిన యాప్‌లో డబ్బులు పెట్టుబడిగా పెట్టి.. చరవాణిలో కొన్ని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ తరహాలో ఓ అంతర్జాతీయ సంస్థ పేరుతో కొంతకాలంగా సూర్యాపేట కేంద్రంగా భారీ గొలుసు కట్టు దందా కొనసాగుతోంది. రవ్వంత పెట్టుబడి పెట్టండి.. కొండంత రాబడి పొందండి.. అంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

★ సూర్యాపేటకే పరిమితం కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ, కోదాడ, తిరుమలగిరి, నకిరేకల్ వ్యాప్తంగా మరి కొన్ని పట్టణాల్లో విస్తరించింది. సొంతగా పెట్టుబడి పెట్టడంతోపాటు మరికొందరితో ఈ యాప్‌లో డబ్బులు పెట్టుబడిగా పెట్టిస్తే కమీషన్ పెద్ద మొత్తంలో చెల్లిస్తామని ఆశ చూపెట్టారు. ఇప్పటివరకు ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో బాధితులు డబ్బులు పెట్టి ప్రవేశం పొందారు. సుమారు రూ.50 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు రెండు వారాలుగా పెట్టిన డబ్బులకు తిరిగి చెల్లింపులు జరగడం లేదు.

ఇప్పుడిప్పుడే దందా రూ.కోట్లల్లో..

దీని ప్రధాన కార్యాలయం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్నట్లు, దేశంలోని ఒక్కో రాష్ట్రంలో పదకొండు బ్రాంచ్‌లు ఉన్నట్లు ప్రచారం, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఓ భవనం అద్దెకు తీసుకొని కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జులై 17 నుంచి ప్రారంభించారు. మొదట అనుమానంతో కొందరు తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. ప్రతిఫలంగా వారం.. వారం.. డబ్బులు ఎకౌంట్లోకి వచ్చి పడుతున్నాయి. దీంతో నమ్మకం ఏర్పడడంతో ఇటీవల ఈ మొత్తాన్ని అమాంతం పెంచేశారు. చాలా మంది నిరుద్యోగులు ఈ స్కీంలో చేరుతూ.. ఇతరులను చేర్పించారు. సూర్యాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఈ సంస్థకు సంబంధించిన మీటింగ్‌ను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులతోపాటు మహిళలు సైతం పాల్గొనడం విశేషం.

ఏడాదికి 14 రెట్ల ఆదాయం:

ఎలాంటి కష్టం లేకుండానే ఇంట్లో కూర్చుంటే రూ.లక్షల ఆదాయం అందిస్తామని చెబుతున్నారు. ఈ స్కీంలో చేరాలంటే కనీసం రూ.18 వందల నుంచి గరిష్ఠంగా రూ.54 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఉదాహరణకు.. ఎవరైనా రూ.1.20 లక్షలను ఈ యాప్‌లో పెట్టుబడి పెడితే రూ.16.74 లక్షలు(ఏడాదిలో సుమారు 14 రెట్లు అధికం) సొమ్ము తిరిగి చెల్లిస్తామంటూ నమ్మిస్తున్నారు.

పోలీసుల చర్యలు శూన్యం:

నాలుగు నెలలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్రమంగా పెట్టుబడులు పెట్టిస్తున్నా.. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. అత్యాశకు పోయి నిరుద్యోగులు, అమాయకులు ఇందులో చేరి డబ్బులు చేజార్చుకుంటున్నా.. ఎవ్వరూ నోరు మెదపడం లేదు. ఏడాదిలో 14 రెట్ల డబ్బులు ఎవ్వరూ తిరిగి ఇవ్వలేరన్న విషయంపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

★ ఈ విషయంపై సూర్యాపేట డీఎస్పీ రవిని వివరణ కోరగా.. ఇప్పటివరకు ఈ విషయం తమ దృష్టికి రాలేదని, సంస్థపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. నిర్వాహకులను పిలిపించి విచారణ చేపడతామని పేర్కొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగులో దిగుబడులు మెండు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఉషారాణి, తదితరులు

మోతె, న్యూస్‌టుడే: క్షేత్రంలో ఎక్కువ మొక్కలను నాటడం ద్వారా పత్తి సాగులో అధిక దిగుబడులు పొందవచ్చని సీఐసీఆర్ కోయంబత్తూర్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. ఉషారాణి అన్నారు. రావిపహాడ్ గ్రామంలో అధిక సాంద్రత పత్తిసాగుపై బుధవారం నిర్వహించిన క్షేత్ర దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అధిక సాంద్రత పద్ధతిలో చేలో మొక్కల సంఖ్య అధికంగా ఉండటం వల్ల దిగుబడులు గణనీయంగా పెరుగుతాయన్నారు. ఈ పద్ధతిని రైతులు తమ క్షేత్రాల్లో సాగు చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ నాగ్‌పూర్ వారి సహకారంతో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. విత్తనాలు, సమగ్ర సస్యరక్షణకు అయ్యే ఖర్చుల కింద ఎకరాకు రూ.6వేలు నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నట్లు తెలిపారు. రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కేవీకే సేద్య విభాగం శాస్త్రవేత్తలు డి.నరేష్, ఎ.కిరణ్, ఏవో అరుణ, సంతోష్, రైతులు మల్లారావు, ఉప్పలయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధానికి తూట్లు పొడవొద్దు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి మద్యపాన నిషేధం అమల్లోకి వచ్చిన మండలంలోని గట్టికల్ గ్రామంలో నిషేధాజ్ఞలను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి ఇంటి ఎదుట గ్రామస్థులు భైఠాయించి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో మద్యపాన నిషేధానికి తూట్లు పొడవొద్దని వారు కోరారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ ఆర్.శంకర్‌నాయక్ సిబ్బందితో గ్రామానికి చేరుకొని విచారించారు. మద్యం విక్రయిస్తున్న సదరు వ్యక్తిని రూ.రెండు లక్షల పూచికత్తుతో బైండోవర్ చేశారు. అనంతరం గ్రామస్థులు ధర్నా విరమించారు. ర్యాలీ నిర్వహించి గ్రామంలో ఎలాంటి మద్యం క్రయవిక్రయాలు చేయవద్దని కోరారు. మద్యపాన నిషేధ కమిటీ సభ్యులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


గట్టికల్‌లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రక్తదాన శిబిరంలో పాల్గొనండి: ఎస్పీ

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(పోలీసు ఫ్లాగ్‌డే)ను పురస్కరించుకొని ఈనెల 25న జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసర సమయాల్లో ఇతరులకు ప్రాణదానం చేసేందుకు ఆరోగ్యవంతులైన యువత అందించే రక్తం ఎంతో అవసరం అవుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పౌష్టికాహారం తీసుకొని శుక్రవారం ఉదయం 9 గంటల వరకు ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని ఎస్పీ కార్యాలయానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో వేణుమాధవరావు సూచించారు. ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లలో బుధవారం మంగళితండా ఎఫ్‌పీవో, నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి దివ్య, ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి, నాబార్డు డీడీఎం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎఫ్‌పీవో సీఈవో వెంకన్న, ఛైర్మన్ శంకర్‌నాయక్, డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, సత్తిరెడ్డి, జలేందర్‌రెడ్డి, వీరసోములు, బొల్లం కృష్ణయ్య, హేమ, బాలాజీ, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.


కందగట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో వేణుమాధవరావు, తదితరులు

ఆయన పాట మధురం..!

చిలుకూరు, కోదాడ(బాలాజీనగర్), న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం టైలరింగ్ వృత్తి చేపట్టి కుటుంబాన్ని పోషించాడు. అలా సాగుతున్న తరుణంలోనే కళారంగం వైపు దృష్టి మళ్లింది. సరదాగా పాడే అలవాటుతో కోలాటం వైపు వెళ్లాడు. మళ్లీ కొన్ని రోజులు అలా గడిచిపోయాయి. సరదాగా నేర్చుకున్న పాటతో వేరే బృందాలకు కూడా పాడటం మొదలు పెట్టిన అతడి గాత్రం హైదరాబాద్‌లో అవార్డు అందుకునే స్థాయికి చేర్చింది. ఆయనే చిలుకూరు మండల కేంద్రానికి చెందిన దుగ్గిబోయిన నర్సింహారావు.

★ ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగోలేక పదో తరగతి మధ్యలోనే నిలిపివేశారు. ఆ సమయంలోనే సత్తెనపల్లికి చెందిన ఆంజనేయులు అనే గాన కళాకారుడు నర్సింహారావు ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తూ అందులో మెరుగయ్యేలా సహాయం చేశారు. దీంతో ఆయన ఇప్పటివరకు 14 సంవత్సరాల్లో 1,800 లకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు.


బహుమతులతో నరసింహారావు

ప్రత్యేకతలు..

తితిదే ఆధ్వర్యంలో ఏటా 15 నుంచి 20 బృందాలతో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో తనదైన శైలిలో ప్రదర్శనలు ఇస్తున్నారు. అలాగే పురందర దాసు కీర్తనలను కన్నడలో ఆలపించడం నర్సింహారావు ప్రత్యేకత. ఒంటిసిర్రా కోలాటంలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొని చాలాసార్లు మొదటి బహుమతి అందుకున్నారు. అనంతరం కోదాడ పట్టణానికి చెందిన కళాకారుడు కొండలు అయ్యప్ప భజన బృందంలోకి తీసుకోవడంతో గత 8 సంవత్సరాలుగా ఆ బృందానికి ప్రధాన గాయకుడిగా కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు కొండలు బృందంతో కలిసి ఐదు వందలకు పైగా అయ్యప్ప భజన కార్యక్రమాలు చేశారు. నర్సింహారావు గాత్రాన్ని విన్న హైదరాబాద్ మెగా రికార్డు సంస్థ వారు ప్లాటినం జూబ్లీ అవార్డును అందించి భక్తిగేయాల గాయకుడిగా సత్కరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు సాధించేందుకు పురపాలికలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 40 నుంచి 50 శాతమే ఇలా ఇస్తున్నారు. తద్వారా ఉత్తమ ర్యాంకుల సాధనలో వెనుకబడిపోతున్నారు. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి డిసెంబరు వరకు కొనసాగనున్నాయి.



స్వచ్ఛసర్వేక్షణ్ లో భాగంగా సూర్యాపేటలోని సద్దుల చెరువు వద్ద స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యకళాశాల విద్యార్థులు

వార్డుల వివరాలు	పురపాలికలు	వార్డులు
సూర్యాపేట	5	141
నల్గొండ	8	171
యాదాద్రి	6	104

వార్డుల వారీగా కార్యక్రమాలు..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో 419 వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో ప్రత్యేకంగా చూపించనున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పిస్తారు. పరిసరాల శుభ్రతపై పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మెరుగైన ర్యాంకు సాధనకు కృషి..

– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ సారి అవార్డు వచ్చేలా కృషి చేస్తాం. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించి సూర్యాపేట పురపాలికను రాష్ట్రస్థాయిలో నిలుపుతాం. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుంది.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం

'న్యూస్‌టుడే'తో ఎంజీయూ వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ముఖాముఖి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారు ఉపాధి అవకాశాలు, ఉన్నత ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తామని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. తాను ఇక నుంచి వర్సిటీలోనే నివాసం ఉండి విశ్వవిద్యాలయ పురోగతికి తోడ్పడుతానని తెలిపారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం పరిపూర్ణంగా ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో వర్సిటీలో అన్ని విభాగాలపై సమీక్షలు జరిపి ఏమైనా లోపాలు ఉంటే వాటిని సవరిస్తామని పేర్కొన్నారు. ఇటీవల నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'న్యూస్‌టుడే'తో పలు విషయాలను పంచుకున్నారు..

బయోమెట్రిక్ పక్కాగా అమలు..

విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం పక్కాగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టనున్నాం. అధ్యాపకులు, విద్యార్థుల హాజరును మెరుగుపర్చేందుకు ఈ విధానం అమలు చేస్తున్నాం. విద్యార్థుల హాజరు 75శాతం కన్నా తక్కువగా ఉంటే వారిని పరీక్షలకు అనుమతించబోం.

విద్యార్థుల స్కిల్స్ పెంపుపై దృష్టి..

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలను నేర్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాం. ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడటం, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మనోధైర్యం కల్పించడం, వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించగల నైపుణ్యం, సాంకేతిక, విజ్ఞాన అంశాలు, తదితర ఎన్నో రకాల స్కిల్స్‌పై నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పిస్తాం. ఆయా కంపెనీలతో సంప్రదింపులు చేస్తూ వారు విద్యార్థుల నుంచి ఏ నైపుణ్యాలు కోరుకుంటున్నారో తెలుసుకుని.. అవే అంశాలను నేర్పించి కొలువులు సాధించేలా ప్రయత్నాలు చేస్తాం.

పరిశోధనలకు ప్రాధాన్యం..

వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. వర్సిటీలో ఇప్పటి వరకు సుమారు 33 మంది ఆయా సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఈ విద్యా సంవత్సరం వివిధ సబ్జెక్టుల్లో 62 మందికి అడ్మిషన్ ఇచ్చాం. ఇటీవల పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యింది. భవిష్యత్తులో ఎంజీయూ నుంచి పీహెచ్‌డీ పట్టాలు పొందే వారి సంఖ్య మరింత రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

నేను వర్సిటీలో ఉంటా...

విశ్వవిద్యాలయంలోని వీసీ రెసిడెన్సీలో నేను నివాసం ఉంటున్నాను. నిర్మాణం పూర్తయిన స్టాఫ్ క్వార్టర్స్‌లో అధ్యాపకులు ఉండేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాను. నేను స్థానికంగా ఉండడం ద్వారా వర్సిటీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటుగా వర్సిటీ అభివృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశంగా భావించవచ్చు.

పోస్టుల భర్తీకి ప్రయత్నిస్తాం..

ఎంజీయూలో గత కొన్నేళ్లుగా అధ్యాపక పోస్టులు సగం ఖాళీగా ఉన్నాయి. బోధనేతర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఖాళీలు ఉన్నా విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తూనే...వర్సిటీని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

యువ తేజం.. సేవా పథం

రామన్నపేట, న్యూస్‌టుడే: సేవా పథం మా లక్ష్యం అంటున్నారు పలువురు యువకులు. చదువుతూ.. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ సేవా మార్గం వైపు దృష్టి సారించారు. స్నేహితులతో కలిసి యువజన సంఘాలను ఏర్పాటు చేయడం, స్థాపించిన సేవా సంస్థల్లో సభ్యులుగా చేరడం ద్వారా ఆయా సంస్థల కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. పేదల ఆకలి తీరుస్తూ.. ఆర్థికంగా చేయూతనిస్తూ.. ఆధ్యాత్మిక సేవలు చేస్తూ ముందుకు సాగుతున్న పలువురు యువకులపై కథనం.

ఆకలి తీరుస్తున్న ఆపద్బాంధవులు

దయనీయ స్థితిలో ఉన్న పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతో పోలీస్ ఉద్యోగి జబ్బు వెంకటేశ్ ఆపద్బాంధవులు ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. సంస్థ లక్ష్యాన్ని తెలుసుకున్న మండలంలోని కక్కిరేణి తదితర గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఇందులో సభ్యులుగా చేరారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారితో పాటు నిరుపేదల సమాచారం తెలుసుకుని వారి కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, కొంత ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఇప్పటి వరకు దుబ్బాక, వెల్లంకి, నీర్నెంల, లక్ష్మాపురం, పల్లివాడ, మునిపంపుల తదితర గ్రామాల్లో 25కి పైగా కుటుంబాలకు సాయం అందించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

ఆర్థికంగా చేయూతనిస్తూ..

నీర్నెంలలో కొందరు యువకులు జాబిలి మహాసేన అనే సేవా సంస్థను 2021లో ఏర్పాటు చేశారు. 74 మందితో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతం 139 మంది సభ్యులు ఉన్నారు. సొంతంగా నిధులు సమకూర్చి పిల్లలు లేని వృద్ధులు, పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వారు, అనారోగ్యంతో గుర్తై చికిత్స పొందుతున్న వారిని గుర్తించి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకు వస్తున్నారు. రూ.10 వేలు నుంచి రూ.20వేలకు పైగా ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు రామన్నపేట, నీర్నెంల తదితర గ్రామాల్లో పదికి పైగా కుటుంబాలకు రూ.2లక్షలకు పైగా ఆర్థిక సాయాన్ని అందించామని సంస్థ సభ్యుడు నోముల యాదగిరి పేర్కొన్నారు.



నీర్నెంలలో ఆర్థికసాయం అందజేస్తున్న జాబిలి మహాసేన సభ్యులు

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా..

రామన్నపేట, నీర్నెంల, వెల్లంకి, సిరిపురం, బోగారం తదితర గ్రామాల్లో యువకులు సంఘాలను ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో సంఘంలో 20మందికి పైగా సభ్యులున్నారు.



రామన్నపేటలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న అన్నప్రసాద కమిటీ సభ్యులు

సేవల్లో ముందుండి.. వాసవీక్లబ్ గవర్నర్‌గా ఎదిగి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వాసవీ, వనితాక్లబ్‌ల ద్వారా జరిగే సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తూ అనతికాలంలో క్లబ్‌లో అంచెలంచెలుగా ఎదిగారు నేరేడుచర్లకు చెందిన రాచకొండ విజయలక్ష్మి. ఆమె సేవలను గుర్తించి ఇటీవల మట్టపల్లిలో జరిగిన వాసవీక్లబ్ 104 రీజియన్ సమావేశంలో ఆమెను గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు వాసవీ, వనితాక్లబ్‌ల ద్వారా పేదల కోసం నిర్వహించిన పలు సేవాకార్యక్రమాలకు రూ.10 లక్షలకు పైగా, వృద్ధాశ్రమానికి రూ.2 లక్షలు అందించినట్లు చెప్పారు. అప్పట్లో ఆటో మొబైల్ షాపు నిర్వహణలో పట్టు సాధించడంతో ఆర్యవైశ్య మహాసభ 2019లో ఆమెకు ఉత్తమ మహిళా వ్యాపారవేత్త అవార్డును అందించి సత్కరించింది. పేద విద్యార్థులకు, నిరుపేద మహిళలకు సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.



విజయలక్ష్మి

☛ విజయలక్ష్మి వాసవీక్లబ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. వాసవీక్లబ్ వైస్ గవర్నర్‌గా, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా, డిస్ట్రిక్టు క్యాబినెట్ కోశాధికారిగా, రీజియన్ ఛైర్మన్‌గా, జోన్‌ఛైర్మన్‌గా, నేరేడుచర్ల వాసవీ వనితాక్లబ్ తొలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షురాలిగా, కార్యదర్శిగా పనిచేశారు. వైశ్యగురు సేవారత్న అవార్డును ఆమె అందుకోవడం విశేషం. ☛ రీజియన్‌లోని వాసవీ, వనితాక్లబ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

పర్యాటకుల్ని బుద్ధవనానికి తీసుకురండి: పటేల్ రమేశ్‌రెడ్డి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: బుద్ధగయ నుంచి బౌద్ధ పర్యాటకులను సాగర్‌లోని బుద్ధవనానికి తీసుకురావాలని పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఏబీటీవో ఆధ్వర్యంలో బుద్ధగయలో నిర్వహించిన టూర్స్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. మాట్లాడారు. ఆచార్య నాగార్జునుడు నడయాడి, మహాయన బౌద్ధాన్ని ప్రచలితం గావించి మాధ్యమిక బౌద్ధ తార్కిక విధానాన్ని ప్రచారం చేసిన ప్రాంతం నాగార్జునసాగర్ అన్నారు. అలాంటి ప్రాంతంలో బౌద్ధ సంస్కృతిని ఈ తరానికి తెలియజేయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి పర్యాటకులను తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం బుద్ధవనం గురించి బుద్ధిస్ట్ నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి ట్రావెల్ ఏజెంట్లకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏబీటీవో జనరల్ సెక్రటరీ హంసహాలిడేస్ అధినేత కౌలేష్ కుమార్ బుద్ధగయ తదితరులు పాల్గొన్నారు.



ట్రావెల్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోండి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినులు పాఠశాల స్థాయి నుంచే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసనగర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల గురుకులాల సొసైటీల ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడాపోటీలు దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఆయన బుధవారం ముఖ్యఅతిథిగా వచ్చి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు గురుకులాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ సరిత, విశ్రాంత ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, పీడీ ఇందిరా, పీఈటీ శాంతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ తొలిరోజు షాట్‌పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, ఖో-ఖో క్రీడా పోటీలు నిర్వహించగా.. షాట్‌పుట్, డిస్క్‌త్రో పూర్తయ్యాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.



వాలీబాల్ ఆడి క్రీడలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

విజేతల వివరాలు..

షాట్‌పుట్: సీహెచ్. శ్రావ్య, అనంతగిరి పాఠశాల (మొదటి స్థానం), ఎ.అక్షిత, గుడుగుండ్లపాలెం పాఠశాల (ద్వితీయ).

డిస్క్‌త్రో.. కె.కీర్తి, అప్పాజీపేట పాఠశాల (మొదటి స్థానం), కె.సువార్త, సింగిరెడ్డిపాలెం పాఠశాల (ద్వితీయ).

పల్లెవించిన పంట..!

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: చదివింది వ్యవసాయ డిప్లొమా. ఉన్నత చదువులకు అమెరికాలో అడ్మిషన్ వచ్చింది. రూ.కోటి వరకు ఖర్చు వచ్చేలా ఉండటంతో అంత భారం కుటుంబంపై వద్దనుకున్నాడు. ఇదే అర్హతతో హైదరాబాద్‌లోని ఒక వ్యవసాయ క్షేత్రం మేనేజరుగా కుదిరాడు. ఉద్యోగంలో ప్రవేశించిన నెల రోజుల్లోనే చేదు అనుభవం ఎదురవడంతో ఇంటిదారి పట్టాడు. తమ భూమిని కాపాడుకుంటూనే ఆర్థిక వనరులు సృష్టించుకోవాలని సంకల్పించాడు. ఆ దారిలోనే ముందడుగు పడింది. అంతేకాదు.. తనలాగా ఎవరైనా సేంద్రియ సాగుపై ఆసక్తి చూపితే.. వారికీ ఉచితంగా శిక్షణనిప్పిస్తానంటున్న ఈ యువకుడి పేరు పల్లె భరత్‌రెడ్డి. స్వగ్రామం చింతలపాలెం.



సేంద్రియ పద్ధతిలో కాసిన కూరగాయలను చూపిస్తున్న యువరైతు భరత్‌రెడ్డి

ప్రయాణం సాగిందిలా..

సాగు పద్ధతులపై పట్టుకోసం ఒక క్షేత్రంలో ఉద్యోగంలో చేరా. అక్కడ వీడియోలు తీస్తుంటే ఉద్యోగం నుంచి తొలగించారు. పట్టణాల్లో మాదిరి మా ఇంటి దగ్గర సేంద్రియ వ్యవసాయంతో సంపాదించుకోవచ్చని ఇంటికొచ్చా. అరెకరంలో ప్రయోగాత్మకంగా కూరగాయల తోట వేశా. బావుంది. ప్రస్తుతం దొండ, ఎర్రబెండ, వంగ, సొర, బీర, పచ్చిమిర్చి పండిస్తున్నా. రెండ్రోజులకొకసారి పది కిలోల దిగుబడి వస్తుంది. ఏరోజుకారోజు కోసి వాట్సప్ గ్రూప్‌లో పెట్టగానే ఆర్డరొస్తుంది. అలవాటయ్యేందుకు హోం డెలివరీ ఇస్తున్నా. ఐదారు కిలోలైతే పది కిలోమీటర్ల వరకు వెళ్లి ఇస్తున్నా. పొలం దగ్గరకూ వచ్చి తీసుకెళ్తున్నారు. ఏదైనా మార్కెట్ ధరకే ఇస్తున్నా.



కూరగాయల తోటలో సొర, బీరకాయలు

సొంతూళ్లోనే ఉద్యోగంలా..

మా ఇంట్లో ఆవులు ఉన్నాయి. తోటలో మొక్కల ఎదుగుదలకు ఎరువుగా ఆవు పేడ వాడతా. ఇంకా డైరెక్టర్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ వారు తయారు చేసిన వేస్ట్ డీకంపోజరును తెచ్చుకున్నా. దాన్ని నీళ్లలో కలుపుకొని ఐదు రోజులు నిల్వ చేసి మొక్కల తొలి దశలో దాన్ని స్ప్రే చేస్తుంటా. నాణ్యమైన దిగుబడికి ఆవు పేడతోనే తయారు చేసిన ఘన జీవామృతాన్నీ వాడతా. తెగులు వస్తే నీమాస్త్రం చల్లుతా. సొంతూళ్లోనే ఉద్యోగంలాగా ఇలా సాగు చేసుకోవచ్చు. భూమిని రసాయనాల బారి నుంచి కాపాడుకోవచ్చు. ఆదాయం కూడా లభిస్తుంది. నేనూ ఈ లక్ష్యంతోనే చేస్తున్నా. ఫ్రెండ్స్ ఆర్గానిక్ ఫాం అని సామాజిక మాధ్యమ ఛానల్‌ను పెట్టా. నాలాంటి వారికి ఉచితంగానే శిక్షణనిప్పిద్దామనేది ఉద్దేశం.

నవంబరు మొదటి వారంలో బస్సు యాత్ర: జాజుల

నీలగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన పూర్తి చేసేవరకు పోరాటం ఆపబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణనను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. కులగణనతోనే బీసీల భవిష్యత్తు ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 29తో బీసీలకు మరింత నష్టం ఏర్పడిందన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ, శంకర్, రాములు, శంకరయ్యగౌడ్, భిక్షమయ్య, మధుయాదవ్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్



గవర్నర్ కలిసిన ఎంజీయూ వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, చిత్రంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం

గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బుధవారం హైదరాబాద్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంజీయూలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. వర్సిటీని మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తామని ఆయనకు తెలిపారు. వీసీ వెంట తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఉన్నారు.

ఎన్జీ కళాశాల పీజీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నాగార్జున ప్రభుత్వ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్, ఒకటో, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ ఉపేందర్, పరీక్షల నియంత్రణ అధికారి బి.నాగరాజు విడుదల చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్న అధ్యాపకులను అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలను ఆదర్శప్రాయంగా మార్చాలని కోరారు. ఎమ్మెస్సీ జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఎంకాం, ఎంఏ తెలుగు, అర్థశాస్త్రాలకు సంబంధించిన ఫలితాల వివరాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ప్రసన్నకుమార్, వెల్దండి శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ ఉపేందర్, సీవోఈ నాగరాజు, తదితరులు

సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేశారు. సాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న డ్యాం నుంచి వచ్చిన వరదనీటి కారణంగా ఎన్నెస్పీ ఈ నెల 16వ తేదీ నుంచి 23వ తేదీ అర్ధరాత్రి వరకు సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఎన్నెస్పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శ్రీశైలం నుంచి 78.4 టీఎంసీల వరదనీరు సాగర్ జలాశయానికి చేరగా క్రస్టుగేట్ల ద్వారా 53 టీఎంసీ, కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్‌కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా 25.7 టీఎంసీలు మొత్తం 80.77 టీఎంసీ నీటిని విడుదల చేయగా ప్రస్తుత జలాశయ నీటిమట్టం 589.40 అడుగుల వద్ద ఉంది.

భూ వివాదంలో అన్నను హత్య చేయించిన తమ్ముడు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: భూ వివాదంతో సొంత అన్నను తమ్ముడు సుపారి గ్యాంగ్‌తో కిరాతకంగా హత్య చేయించిన ఘటన నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం నారాయణపురం గ్రామంలో ఈ నెల 16న చోటు చేసుకున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ గ్రామానికి చెందిన కాకునూరి నరసింహకు ముగ్గురు కుమారులు లింగయ్య, కొండయ్య(64), శ్రీను ఉన్నారు. 20 ఏళ్ల క్రితం కొండయ్య, శ్రీను కలిసి అన్న లింగయ్య పేరుతో ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేసి పట్టాచేశారు. కొద్దిరోజుల క్రితం లింగయ్య మరణించగా అతడి పేరిట ఉన్న భూమిని కాకునూరి శ్రీను పట్టా మార్పిడి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొండయ్య గ్రామ పెద్దలు, బంధువుల వద్ద పంచాయితీ పెట్టించారు. దీంతో కాకునూరి శ్రీను తన అన్న కొండయ్యను అడ్డు తప్పించుకోవాలని భావించి పాత నేరస్థులు వేముల నాగరాజు, పందిరి లింగస్వామిలను సంప్రదించి రూ.5 లక్షలకు హత్యచేసేలా సుపారి ఇచ్చాడు.

★ సుపారి గ్యాంగు సభ్యులు కొద్దిరోజులుగా కొండయ్య కదలికలపై రెక్కీ నిర్వహించి ఈనెల 16న ఇంట్లో ఉన్న కొండయ్యను కత్తితో పొడిచి ఆటోలో ఎక్కించుకుని పోతుండగా గ్రామస్థులు అడ్డుకోగా అక్కడే కొండయ్యను పడేసివెళ్లారు. ఈ నెల 22న పోలీసులు హత్య కేసు నిందితులు కాకునూరి శ్రీను, వేముల నాగరాజు, పందిరి లింగస్వామి, చీరాల సురేష్, జిట్టబోయిన వెంకన్నలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద ఆటో, 5 చరవాణులు, రూ.15వేల నగదు, కత్తి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపుతున్నామన్నారు. నేరస్థులను అదుపులోకి తీసుకున్న సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్య సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్య



విద్యార్థులకు తుపాకీపై అవగాహన కల్పిస్తూ..



పోలీస్ డాగ్‌కు ఆహారం అందిస్తున్న విద్యార్థిని

ఆయుధాలు పరిశీలిస్తూ.. డాగ్‌ను లాలిస్తూ

పోలీసులు వాడే ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్‌లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోలీస్ ఆయుధాలు, బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం, కమాండ్ కంట్రోల్, సీసీ కెమెరాలు, మాదక ద్రవ్యాల కిట్లపై అవగాహన కల్పించారు. డీఎస్పీ రమేశ్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ సంతోశ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నల్గొండ అర్బన్

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వేధింపులకు గురి చేశారు. ఈనెల 12న సదరు బాలిక పాఠశాలకు వెళ్తున్న సమయంలో ముగ్గురు యువకులు అడ్డుకొని వీడియోలు చిత్రీకరించి బెదిరింపులకు పాల్పడ్డారు. బాలిక నుంచి రూ.700 నగదును చోరీ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

పశువుల వాహనం పేరిట వసూళ్లు..!

కోదాడ, న్యూస్‌టుడే: పశువులను అక్రమంగా కబేళాకు తరలిస్తుంటే ఆ వాహనాన్ని అడ్డుకొని సీజ్ చేసి పశువులను రక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కానీ కొందరు పోలీసులు సంపాదనే ధ్యేయంగా పశువుల వాహనాన్ని పట్టుకొని అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన ఇటీవల కోదాడ డివిజన్ పరిధిలో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని ఓ పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో రాత్రి సమయంలో పోలీసులు వాహనంలో గస్తీ కాస్తున్నారు. అదే సమయంలో వాహనంలో కొందరు పశువులను తరలిస్తుండగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయాల్సిన పోలీసులు వ్యాపారులతో బేరసారాలు ఆడినట్లు తెలిసింది. సీజ్ చేయకుండా రూ.లక్ష వరకు వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. దాంట్లో రూ.30 వేలు ఆన్‌లైన్ విధానంలో చెల్లించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఈ దందా ఎప్పటి నుంచో జరుగుతుందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటేనే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

3న సదర్ ఉత్సవాలు


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా యాదవుల సంప్రదాయమైన సదర్ ఉత్సవాలను కోదాడ పట్టణంలో నవంబరు 3న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్ శ్రీకాంత్ యాదవ్, కోదాడ నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్ తెలిపారు. లింగమంతులస్వామి ఆలయ ఆవరణలో బుధవారం సదర్ సమ్మేళనానికి సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. శ్రీనివాస్, సూర్యనారాయణ, సిద్దయ్యయాదవ్ పాల్గొన్నారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

పరిశీలన

మునగాల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం తనిఖీ చేసి, ఎస్ఏ పరీక్షలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? నడిగూడెంలోని ఎస్సీ కాలనీలోని మొదటి వార్డులో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. కోళ్లను చంపుతున్నాయి. మనుషులను కరుస్తున్నాయి. అలాగే ఇక్కడ మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. –కిషోర్, నడిగూడెం

✓ కుక్కలను పట్టుకుంటాం. మురుగు కాలువల విషయమై పరిశీలించి చర్యలు చేపడతాం. –ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నడిగూడెం

సబ్ కోర్టు జడ్జిగా బాధ్యతల స్వీకరణ

కోదాడ, న్యూస్‌టుడే: కోదాడ సబ్ కోర్టు జడ్జిగా సురేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ పదోన్నతిపై సబ్ కోర్టు జడ్జిగా కోదాడకు వచ్చారు. అనంతరం కోదాడ బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను సన్మానించారు.


కోదాడ సబ్ కోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

గతంలో ఇక్కడ పని చేసిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్ పదోన్నతిపై బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, ఉపాధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి రామిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక



హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కరక్కాయలగూడెం గ్రామానికి అంకతి నాగేందర్‌రావు, జ్యోతిల కుమార్తె సత్యశ్రీ మంగళవారం టీజీపీఎస్సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో సివిక్స్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. నాగేందర్ ఉద్యోగ రీత్యా నల్గొండలో ఉండగా ఆమె విద్యాభ్యాసం అక్కడే పూర్తి చేశారు. సత్యశ్రీ సివిల్స్ కోసం శిక్షణ తీసుకొని పౌరశాస్త్ర అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. ఆమెను డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు వెంకటేశ్వర్లు, మాధవరావు, తదితరులు అభినందించారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు కృషి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: చెకుముకి టాలెంట్ టెస్టుల ద్వారా విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తి పెంపొందేలా జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో చెకుముకి టాలెంట్ టెస్టు గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం వివిధ పాఠశాలల్లో గోడపత్రికను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విడుదల చేశారు. డీవో రాజేందర్‌రెడ్డి, మండల విద్యాధికారి సైదానాయక్, శ్రీనివాసరెడ్డి, జయవాణిదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు, తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్: చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను విడుదల చేస్తున్న హెచ్ఎం జయవాణి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు

మేళ్లచెరువు: కందిబండ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను ఎంఈవో వెంకటరెడ్డి బుధవారం పాఠశాల హెచ్ఎం అనిల్‌కుమార్, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు జాఫర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ పరీక్షలు పాఠశాల స్థాయిలో నవంబరు 7న, మండల స్థాయిలో 21న, జిల్లా స్థాయిలో 28న జరుగుతాయని తెలిపారు.

మార్కెట్ పీఠం ఎవరిదో..!



కోదాడ, న్యూస్‌టుడే: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నియామకం ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. కమిటీని నియమించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత ఛైర్‌పర్సన్ పదవి కాలం 2002 అక్టోబరు 19న ముగిసింది. పదవి ముగిసి రెండేళ్ల కాలం పూర్తయినా నేటికీ నూతన కమిటీ నియామకం కాలేదు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మార్కెట్ కమిటీ నియామకాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇప్పటికే జిల్లాల్లో పలు మార్కెట్ కమిటీ నియామకాలు ఎప్పుడో పూర్తయిన సంగతి తెలిసిందే.

ముమ్మరంగా ప్రయత్నాలు..: ఈ దఫా మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పదవి రిజర్వేషన్‌లో భాగంగా ఎస్సీ మహిళకు దక్కింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా ప్రొటోకాల్ వర్తించే పదవి కావడంతో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఆ సామాజిక వర్గంలో తీవ్ర పోటీ నెలకొంది. ముఖ్య నాయకులు తమ భార్యలకు అవకాశం కల్పించాలని పైరవీలు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా నడిగూడెం మండలం నుంచి ఎక్కువ మంది ఆశిస్తున్నారు.


కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

పదవి తమ మండలానికే దక్కుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మునగాల, మోతె, చిలుకూరు, అనంతగిరి, కోదాడ రూరల్ పరిధిలో గల అర్హులైన వారు అవకాశం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తున్నారు.

★ ఛైర్‌పర్సన్ పదవికి తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో వైస్ ఛైర్మన్ నియామకం అంతర్గతంగా పూర్తయినట్లు సమాచారం. కోదాడ పట్టణంలో నివసిస్తున్న మైనార్టీ వర్గానికి చెందిన ఓ వ్యక్తికి వైస్ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు తెలిసింది. రాబోయే 10 రోజుల్లో పూర్తి స్థాయిలో మార్కెట్ కమిటీ నియామకం పూర్తి అవుతుందని ఆశావహులు చెబుతున్నారు. కమిటీలో మొత్తం 18 మందికి అవకాశం కలగనుంది. కమిటీలో జిల్లా మార్కెట్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, కోదాడ పుర ఛైర్‌పర్సన్, స్థానిక పీఏసీఎస్ ఛైర్మన్, లైసెన్స్ పొందిన ఇద్దరు వ్యాపారులు, 12 మంది రైతులు ఉండనున్నారు.

పౌతి రిజిస్ట్రేషన్‌పై పోలీసుల విచారణ

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నల్లబండగూడెంలో గంజ చిన్న గురవయ్యకు చెందిన ఎకరం భూమి అక్రమ రిజిస్ట్రేషన్ విషయంలో బుధవారం పోలీసులు విచారణ ప్రారంభించారు. బతికుండగానే గురవయ్య భూమిని మరో వ్యక్తికి అక్రమంగా పౌతి రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు చేసినట్లు ఈనెల 23న 'ఇదేం చిత్రం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇంటెలిజెన్స్ అధికారులు సదరు వ్యక్తిని విచారణ చేశారు. వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

స్పందనకు వందనం

లారీ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ది కోదాడ లారీ అసోసియేషన్ సభ్యులందరూ ఐక్యంగా ఉంటూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేద్దామని ఆ సంఘ నాయకులు అన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి ప్రధాన సలహాదారులుగా ఆవుల రామారావు, కనగాల నాగేశ్వరరావు, రామినేని శ్రీనివాసరావుతో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటనారాయణ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, తదితరులున్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సలహాదారు రామారావు

పోలీసు చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కోదాడ, న్యూస్‌టుడే: విద్యతో పాటు విద్యార్థులు పోలీసు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాలకు చెందిన విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించగా, వారికి అవగాహన కల్పించారు. తుపాకి పనితీరు, వాహనాలకు చలానాలు ఎలా విధిస్తారు, ఖైదీలను ఉంచే గది, నిందితులపై ఉపయోగించే సెక్షన్లు, నేరాల నియంత్రణలో సీసీ పుటేజీల వినియోగం, షీ టీమ్స్ పనితీరు, ఇతర వాటిపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలకు చలానాలు విధించే ట్యాబ్ పని తీరును విద్యార్థులకు వివరిస్తున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము

హుజూర్‌నగర్ గ్రామీణం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీఐ చరమందరాజు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో బుధవారం మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు.


హుజూర్‌నగర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చరమందరాజు

'అధిక ధరలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం'


హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: దేశంలో అధిక ధరలను అదుపు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగార్జున పాండు విమర్శించారు. రోజురోజుకు పెరుగుతున్న ధరల వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో అధిక ధరలకు నిరసనగా తహసీల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ధరల భారం ప్రజలపై పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ఆహార సంస్థలలో మూలుగుతున్న బియ్యం, గోధుమలను పేదలకు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 28 కలెక్టరేట్ కార్యాలయాల ముందు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, హుస్సేన్, శ్రీను, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా పోరాటాలు

చిలుకూరు, న్యూస్‌టుడే: నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నవంబరు 2న దిల్లీలో జరిగే ఆలిండియా జాతీయ, రాష్ట్ర మహిళా సమాఖ్య మహాసభలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో బుధవారం జరిగిన మహిళా సమాఖ్య జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలకు అండగా ఉండి పోరాటాలు చేసే ఘనత కేవలం మహిళా సమాఖ్యకే దక్కుతుందన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ పార్లమెంటులో బిల్లు పెట్టినా నేటికీ అమలు చేయలేదన్నారు. ఇటీవలి కాలంలో ఏకపక్ష ప్రేమల వల్ల ఎంతో మంది బాలికలు, మహిళలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ప్రతి ఠాణాలో షీ టీం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, జిల్లా, మండల నాయకురాళ్లు లక్ష్మీ, జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన ఓ మురుగు కథ

రూ. 1.67 కోట్ల వెనుక..


రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువులో రూ.1.65 కోట్లతో చేపట్టిన రోడ్డు వెనక ఓ మురుగు కథ దాగుంది. ఈ కథకు ముగింపు పలకకుండానే రోడ్డుకు పైపై సోకులు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు అధికారులు. స్థానిక ప్రజల నుంచి ప్రతిపాదనే రాని ఈ కొత్త రోడ్డును మరో రెండు నెలల్లోనే పూర్తి చేస్తామని చెబుతున్న అధికారులు.. ఇదే రోడ్డు వెంట ఎన్నాళ్ల నుంచో దాగి ఉన్న మురుగు కాల్వ కథను పక్కన పెట్టారు. మేళ్లచెరువు-కోదాడ ప్రధాన రహదారి వెంట మేళ్లచెరువులో ఈ తతంగం జరుగుతోంది. ఇక్కడ అర కిలో మీటరు దూరం కొత్తగా తారు రోడ్డు నిర్మిస్తున్నారు. దీనికంటే ముందుగా దీనికి ఇరువైపులా నిర్మించాల్సిన మురుగు కాల్వ ప్రస్తావనే లేకుండా చేస్తున్నారు. 550 మీటర్ల పొడవు గల ఈ కొత్త విస్తరణ పనులకు రూ.3.25 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు మాత్రం రూ.1.67 కోట్లతో పనులు చేపట్టారు. డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఈ రోడ్డు పనుల్లో అంతర్భాగం చేశారు. అవసరమైన మురుగు కాల్వ గురించే పట్టించుకోలేదు.

రైతులకు ఇబ్బంది..

వాస్తవంగా ఈ రోడ్డు విస్తరణకు ముందూ ఈ దీనిపై ఎక్కడా గుంతల్లేవు. ఐనా తవ్వేశారు. కంకర పోస్తున్నారు. రోలర్‌తో తిప్పుతున్నారు. ఇరువైపులా నీరు వెళ్లేందుకు రోడ్డుకు అడ్డంగా గూనలతో కల్వర్టులు కడుతున్నారు. కానీ.. ఇదే నీరు వాగులోకి వెళ్లేందుకు రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వలను నిర్మించాలన్న ఆలోచన చేయడం లేదు. ఈ స్థితిలో వానొస్తే నీరు పక్కకు పోయే దారి లేదు సరికదా ఎగువ నుంచి మురుగుకాల్వలో వచ్చే నీరు ఇక్కడికి రాగానే ఎప్పటిలాగానే రోడ్డెక్కే అవకాశాలు ఉన్నాయి. వరద ఎక్కువైతే రోడ్డు వెంట పంట పొలాలు ఈ మురుగు వ్యర్థాలతో నిండిపోయే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ దుస్థితి రైతులు ఎదుర్కొంటున్నారు. ఇంతటి తీవ్ర సమస్యను పక్కన పెట్టేసి.. స్థానికులు అస్సలు ప్రతిపాదించని రోడ్డు పనులు చకచకా చేసేస్తుండటం గమనార్హం. ఇదే సమస్య తీవ్రతను స్థానికులు ఇటీవలే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రహదారి విస్తరణ కంటే ముందే రోడ్డుకిరువైపులా మురుగు కాల్వలను నిర్మించాలని కోరారు. ఇదే విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ సతీష్‌ను వివరణ కోరగా.. రోడ్డు విస్తరణ పనుల్లో మురుగు కాల్వ ప్రతిపాదన లేదన్నారు. దాని నిర్మాణానికి మళ్లీ ప్రత్యేకంగా ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు.


రోడ్డు కింద మురుగు వెళ్లేందుకు వేసిన గూనలోనే ఆగుతున్న బురద, నీరు

ముగిసిన కార్యశాల

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం వారికి ఏర్పాటు చేసిన మ్యాట్ అండ్ సిములింక్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షకుడు శరత్‌చంద్ర మాట్లాడారు. సాంకేతికతను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యశాలలో ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థినులకు తమ సంస్థలో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ప్రిన్సిపల్ గాంధీ, డైరెక్టర్ నాగార్జునరావు, విభాగాధిపతి మహమ్మద్ ఏజాన్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ గాంధీ, తదితరులు

సీఎంపై క్రిమినల్ కేసు నమోదు చేయండి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను బుల్డోజర్ ఎక్కించి చంపుతామని బెదిరించిన సీఎంపై హత్యానేరం కింద కేసు నమోదుచేయాలని భారాస నాయకులు గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చలికంటి నరేష్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్‌కుమార్, నాగరాజు, రాంసైదులు, నరహరి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దొరకుంట శివారులో అక్రమంగా తరలిస్తున్న 3 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సురేష్ అనే వ్యక్తి ఆటోలో దొరకుంట నుంచి జగ్గయ్యపేటకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి ఆటోతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మేళ్లచెరువు: చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెం గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న వారి నుంచి మూడు క్వింటాళ్ల బియ్యం, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో అక్రమంగా బియ్యం సేకరిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లినట్లు తెలిపారు. పోలీసుల రాకను చూసిన నిందితులు బియ్యాన్ని, వాహనాలను అక్కడే వదిలి పారిపోయారని వివరించారు. బియ్యం, ద్విచక్రవాహనాలు, తూకం వేసే యంత్రం వదిలి వెళ్లడంతో వాటిని స్వాధీన పరుచుకొన్నామన్నారు స్థానికులను విచారించగా పారిపోయిన వారు వెంకటేశ్వర్లు, ఏకానందం, పుల్లయ్య, చంద్రం, లక్ష్మణ్, కందుకూరి సుధాకర్‌గా తెలిసిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

'హామీలు అమలు చేయని ప్రభుత్వం'

మునగాల గ్రామీణం: నల్గొండలో ఈ నెల 25, 26, 27తేదీల్లో జరిగే భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర రెండో కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. బరాఖత్‌గూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమిస్తున్న ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టి ముందస్తు అరెస్టులు చేయిస్తుందన్నారు. దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలు, ఉచిత ప్రయాణం, ఖాళీగా ఉన్న వారికి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని, ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో ఈదయ్య బాబు, మదన్‌మోహన్‌రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్

మునగాల, న్యూస్‌టుడే: పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రెస్‌క్లబ్, జనవేదిక, యువత ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ వైద్యశాల నుంచి గణపవరం రహదారి ఫ్లైఓవర్ వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నడిగూడెం, న్యూస్‌టుడే: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ధ్యాన మార్గాన్ని అనుసరించాలని మహేశ్వర మహా పిరమిడ్ వ్యవస్థాపకుడు దామోదర మహాస్వామి అన్నారు. బుధవారం నడిగూడెం సాయిమందిరం, బృందావనపురం ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ధ్యాన నియమాలపై వివరించారు. ఖమ్మం పిరమిడ్ సొసైటీ అధ్యక్షురాలు, ధ్యానరత్న కాటేపల్లి శైలజ, మాస్టర్లు ఉపేందర్, అచ్చిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్టీయూ పోరాటం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు.


నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.జితేందర్‌రెడ్డి, టి.నరేష్

గరిడేపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతుందని సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, నరేష్ అన్నారు. గడ్డిపల్లి, పొనుగోడు ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న శ్రీపాల్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు.

నేరేడుచర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు టి.జితేందర్‌రెడ్డి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాలకవీడు జడ్పీహెచ్ఎస్, కస్తూర్బా పాఠశాలల ఉపాధ్యాయులను బుధవారం కలిసి పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికి తొలిప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

ఉద్యోగులకు బహుమతుల ప్రదానం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: రాఖీ పౌర్ణమి, దసరా పండగ సందర్భంగా సమష్టి కృషితో ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించి అత్యధిక ఆదాయాన్ని సాధించిన ఉద్యోగులకు ఆర్టీసీ డీఎం శ్రీహర్ష బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. దీపావళి, శుభ ముహూర్తాలు ఉన్నందున ఇదే స్ఫూర్తిని కొనసాగించి రాష్ట్రంలోనే కోదాడ డిపోను ముందంజలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, ఎం.ఎఫ్. రాజేష్, సూపర్‌వైజర్లు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం


గుంతలు పూడ్చరూ..!



మండలంలోని మొద్దులచెర్వు నుంచి మోతె వెళ్లే ప్రధాన రహదారిలో మొద్దులచెర్వు స్టేజీ వద్ద భారీ వాహనాలు వెళ్లడంతో గుంత పడింది. వాహనాలు దిగబడిపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు పేర్కొన్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా మొరం పోసి చదును చేయిస్తామన్నారు.

–మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే:

ఆహ్లాదకరం.. బంతి పూలవనం



పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామంలో కాటూరి శేషగిరి అనే రైతు వేసిన బంతిపూల తోట కనువిందు చేస్తోంది. తనకున్న పొలంలో వరి, కూరగాయల సాగుతో పాటు బంతిపూల సాగు చేపట్టారు. వెయ్యి మొక్కలు రెండు నెలల క్రితం వేశారు. ప్రస్తుతం బంతిపూల తోటలో పూలు బాగా పూశాయి. పండగల సీజన్ కావడంతో పూలకు మంచి డిమాండ్ ఉందని రైతు చెబుతున్నారు. వివిధ రకాల పంటల సాగు ద్వారా ఆదాయం పెంచుకోవడం లక్ష్యంగా రైతు పూల సాగు చేపట్టినట్లు తెలిపారు.

–నేరేడుచర్ల, హుజూర్‌నగర్ న్యూస్‌టుడే:

అవీ ఇవీ

జయంతి.. మునగాల గ్రామీణం: తెలంగాణ తొలి మాండలిక రచయిత కే.ఎల్. నరసింహారావు శతజయంతిని పురస్కరించుకొని రేపాలలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ట్రస్ట్ సభ్యులు నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

అందజేత.. హుజూర్‌నగర్: పట్టణంలోని సీతారాంనగర్‌కు చెందిన ఓ నిరుపేద మహిళకు జమాతే ఇస్లామి హింద్ సంస్థ జీవనోపాధి కల్పించి ఆదుకుంది. లతీఫా బేగం భర్త చనిపోయి జీవనానికి ఇబ్బందులు పడుతున్న విషయం జమాతే ఇస్లామి హింద్ సంస్థకు తెలియజేయడంతో సంస్థ స్పందించి పట్టణ అధ్యక్షుడు మజీద్ ద్వారా బుధవారం ఆమెకు కుట్టు మిషన్ అందజేసి జీవనాధారం కల్పించారు.

ఎన్నిక.. నేరేడుచర్ల: నేరేడుచర్ల మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తునికిపాటి మల్లాచారిని నియమిస్తూ ఆ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధనుంజయనాయుడు బుధవారం నియామక పత్రం అందజేశారు.

సంతాపం.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణ, పరిసర గ్రామాల వారికి డాక్టర్ సుదర్శన్‌నాయుడు అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన సంతాప కార్యక్రమంలో నివాళి అర్పించారు.

వినతి.. మునగాల: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏళ్లుగా ఉన్న చెట్లను అనుమతి లేకుండా నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్లుకు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చెట్ల సమీపంలో పిల్లలు ఆడుకుంటారు కాబట్టి అప్పటి ఎంఈవో, ఏపీసీ, తల్లిదండ్రుల అనుమతితో కేవలం చెట్ల కొమ్మలు నరికించినట్లు తెలిపారు.

డీజే సీజ్.. హుజూర్‌నగర్ గ్రామీణం: లింగగిరిలో ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం కొంతమంది ముందస్తు అనుమతి తీసుకోకుండా డీజేను ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతో డీజేను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్తయ్య తెలిపారు.

పారిశుద్ధ్య లోపంతో ఇబ్బందులు.. హుజూర్‌నగర్ గ్రామీణం: గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రైతు సమన్వయకర్త పరశురాం అన్నారు. బూరుగడ్డలో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్‌ను తిప్పకపోవడంతో చెత్త పేరుకుపోయిందన్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

'చెవిటి వెంకన్నకు సముచిత స్థానం ఇవ్వండి'

నాగారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని పార్టీ మండల యువజన ప్రధాన కార్యదర్శి షేక్ వలీ విజ్ఞప్తి చేశారు. నాగారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే తన లక్ష్యంగా పనిచేస్తూ జిల్లాలో మంచి గుర్తింపు కలిగిన నాయకుడికి ఉన్నత పదవి ఇచ్చి గౌరవించాలన్నారు. వెంకన్నకు పదవి ఇవ్వడం ద్వారా బీసీ సామాజిక వర్గానికి గుర్తింపు ఇచ్చినట్లవుతుందన్నారు. భట్టు అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

తుంగతుర్తి, న్యూస్‌టుడే: శ్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలతో వ్యాపారం చేయించి సంఘాల బలోపేతానికి కృషి చేయాని డీఆర్డీవో ఆర్.ఎం శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో వీవోఏలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు గేదెలు, ఆవులు, పెరటి కోళ్ల పెంపకం, మదర్‌యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహించాలని సూచించారు. సంఘాల ద్వారా రుణాలు తీసుకొని వాయిదాలు చెల్లించని వారి నుంచి తిరిగి సొమ్ము వసూళ్లు చేయించాలని బాధ్యత వీవోఏలదేనన్నారు. డీపీఎం రత్నయ్య, ఏపీఎంలు రాంబాబు, మల్లేశ్, శోభ, మధుసూదన్, సీసీలు యాదగిరి, రామయ్య పాల్గొన్నారు.



తుంగతుర్తిలో వీవోఏల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.ఎం శివప్రసాద్

పెన్‌పహాడ్ ఎస్సై వీఆర్‌కు అటాచ్

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: పెన్‌పహాడ్ ఎస్సై రవీందర్ బుధవారం వీఆర్‌కు అటాచ్ అయ్యారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడంలో విఫలమయ్యారని ఎస్సైను వీఆర్‌లో పెడుతూ ఐజీపీ సత్యనారాయణ ఈనెల 5న ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా కొనసాగిన ఎస్సై రవీందర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ యాదగిరికి స్టేషన్ ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



సూర్యాపేటలోని తిరుమలనగర్ రోడ్డు దుస్థితి మారడం లేదు. రహదారి పొడవున 30 గుంతలు ఉండగా.. 15 నిమిషాలకు 15 వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడి నుంచి రోజుకు 1440 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారికి 2017లో శంకుస్థాపన చేయగా నేటికీ సీసీగా మారటం లేదు. రహదారి పొడవున గుంతలు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకా ఎన్నిరోజులు రహదారి బాగుపడుతుందోనని ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదు. - భానుపురి, న్యూస్‌టుడే:

30 గుంతలు.. ముప్పుతిప్పలు

☛ నేటికీ మారని తిరుమలనగర్ రోడ్డు దుస్థితి

ఇదీ పరిస్థితి..

సూర్యాపేట పట్టణంలోని తిరుమలనగర్ రోడ్డు.. ఖమ్మం రోడ్డు, నూతన కలెక్టరేట్ 60 ఫీట్ల రోడ్డుకు ప్రధాన మార్గంగా మారింది. ఈ దారి గుండా కుడకుడ రోడ్డు, ఖమ్మం రోడ్డుకు రాకపోకలకు అనువుగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఇక్కడి నుంచే పాఠశాలల విద్యార్థులు వెళ్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి చిత్తడిగా మారడంతోపాటు గుంతలు పడ్డాయి. ప్రధానకాలనీ రోడ్లే ఇలా ఉంటే శివారు కాలనీల పరిస్థితి ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

■ తిరుమలనగర్ కాలనీ రోజురోజుకూ విస్తరిస్తోంది. కాలనీ అవసరాల దృష్ట్యా ప్రధానంగా రహదారులు ముఖ్యం. కానీ నేటికీ మట్టిరోడ్డే దర్శనమిస్తున్నాయి. కనీసం గుంతల్లో కూడా మట్టిపోసేవారే కరవయ్యారు. ఈ కాలనీలో ముత్యాలమ్మ ఆలయం ఉంటోంది. ప్రతి ఆదివారం భక్తులు పూజల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నిరోజులు ఎదురుచూడాలి..

- లింగయ్య, తిరుమలనగర్ కాలనీ

ఈ రహదారికి శంకుస్థాపన చేసి ఏడేళ్ల గడుస్తున్నా నేటికీ గుంతల్లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు సీసీగా మారుస్తారోనని ఎదురుచూస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

- శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఈ రోడ్డు నిర్మాణ విషయమై ఉన్నతాధికారులకు వివరిస్తాం. వారి నుంచి ఆదేశాలు రాగానే నిర్మాణం చేపడతాం. ప్రస్తుతానికి గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? తిరుమలగిరి పురపాలికలో రెండోవార్డులో ప్రాథమిక పాఠశాల వెనుక వీధిలో పిచ్చిమొక్కలు పెరిగి పాదచారులకు ఇబ్బందిగా ఉంది.
- జి. శ్రీనివాస్, తిరుమలగిరి

✔ వెంటనే సిబ్బందిని పంపించి మొక్కలు తొలగిస్తాం. - ఎం. బుచ్చిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ పురపాలిక తిరుమలగిరి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని అంజనాపురి కాలనీ రోడ్డు నం.3లో వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయంలో అంధకారం నెలకొని కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చర్యలు చేపట్టాలి.
- మురళీకృష్ణ, అంజనాపురి కాలనీ

✔ పరిశీలించి ఏర్పాటు చేయిస్తాం.
- శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని వెంకటేశ్వరకాలనీ రోడ్డు నం.5లో మురుగు కాల్వలో పూడిక తీయటం లేదు. మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. కాలనీవాసులు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. వెంటనే తీయించాలి.
- రవికుమార్, వెంకటేశ్వరకాలనీ

✔ సిబ్బంది పంపించి వెంటనే తీయిస్తాం. - సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

క్షయ నిర్ధారణ పరీక్షలు.. అవగాహన

నాగారం, న్యూస్‌టుడే: క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చునాయక్ అన్నారు. ఈటూరులో బుధవారం క్షయ నిర్ధారణ శిబిరంలో ఆయన మాట్లాడారు. క్షయ లక్షణాలను గుర్తించిన వెంటనే చికిత్స అందించినట్లయితే నయమవుతుందని సూచించారు. ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపి వ్యాధిగ్రస్థులకు మందులు పంపిణీ చేశారు. పల్లె దవాఖాన వైద్యురాలు నజీయా, ఆరోగ్య సూపర్‌వైజర్ రామచంద్రయ్య, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్‌రెడ్డి, యాదగిరి, కళమ్మ, బేబి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈటూరులో క్షయ నిర్ధారణ శిబిరంలో ఔషధాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిరాల గ్రామీణం: మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో బుధవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారిణి అమూల్య ఆధ్వర్యంలో 16 మందికి పరీక్షలు చేశారు. అనంతరం గ్రామస్థులకు ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పల్లె వైద్యులు తేజ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, ఏఎన్ఎం జయ, టీబీ సూపర్‌వైజర్లు ప్రసాద్, కిరణ్, పాల్గొన్నారు.

అత్యాచారయత్నం: కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్): మండలంలోని ఓ గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇరుగు హరీష్ అనే వ్యక్తి ఈ నెల 21న అర్ధరాత్రి తలుపు తట్టడంతో బాధితురాలు తలుపు తీసింది. లోపలికెళ్లి బలాత్కారం చేయబోగా బాధితురాలు కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు నిద్ర లేవడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ అధికారి ఆర్. శంకర్‌నాయక్ తెలిపారు.

ఆరబెట్టిన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందండి



నూతనకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



చివ్వెంల: తుల్జారావుపేటలో.. ఏపీఎం సైదయ్య, తదితరులు

చివ్వెంల, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలకు నిబంధనల ప్రకారం ఆరబెట్టిన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని ఏపీఎం సైదయ్య సూచించారు. మండలంలోని తుల్జారావుపేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సీసీ ఉపేందర్, కాంగ్రెస్ నాయకుడు రమేష్, వేణుధర్, రంగనాయకులు, వెంకటేశ్వర్లు, మోహన్, రైతులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని సింగారెడ్డిపాలెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ లాలు ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీఎం అజయ్ నాయక్, ఎంపీవో సంజీవయ్య, ఏవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అఖిల్, ఇన్‌ఛార్జి సీసీ ఆశా, సంఘబంధం అధ్యక్షురాలు శైలజ, కోశాధికారి చంద్రకళ, లలిత, గీతారాణి, స్వరూప పాల్గొన్నారు.

నూతనకల్: మద్దతు ధరతోపాటు బోనస్ కల్పిస్తూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నూతనకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నూతనకల్ పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునిత, ఏపీఎం రమణాకర్, మండల వ్యవసాయ అధికారి మురళిబాబు, సీసీలు ముత్తయ్య, సరస్వతి, సంఘబంధం-4 అధ్యక్షురాలు చిర్ర మంజూల, కళ్లెం సునిత, నాగం సుధాకర్‌రెడ్డి, తీగల గిరిదర్‌రెడ్డి, కట్ట మల్లారెడ్డి, చంద్రారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బకాయి పడిన ఐదు నెలల డీఏ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొమ్మాల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీయూపీఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి, శేఖర్ పాల్గొన్నారు.



కొమ్మాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆర్డీవోకు వినతి

భానుపురి, ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: బాణమతి వస్తుందనే నెపంతో ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామానికి చెందిన అర్రూరు నర్సయ్య, భార్య అనసూర్యను కుమారుడు, కోడలు నిర్బంధించి మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లగొట్టారు. బుధవారం ఆర్డీవో వేణుమాధవరావుకు వృద్ధదంపతులు వినతిపత్రం అందజేశారు. ఉన్న ఐదెకరాల భూమిని కుమారుడే సాగు చేసుకుంటున్నారని, తమకు ఎలాంటి భక్తము ఇవ్వటం లేదని ఆర్డీవోకు వివరించారు. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టగా భక్తము ఇస్తామని ఒప్పుకున్నారని, ప్రస్తుతం మంత్రాల నెపంతో ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వినతిలో పేర్కొన్నారు.

చేతికందే ఎత్తులో.. విద్యుత్తు తీగలు

పట్టణ వాసులు ఇటీవల ఆరోగ్యంపై దృష్టి సారించి.. పట్టణంలోని సద్దుల చెరువు(మినిట్యాంక్ బండ్) ప్రాంగణంలో ఉదయం సాయంత్రం నడకను కొనసాగిస్తున్నారు. చెరువు కట్టపై నడక దారిలో చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. దీంతో మార్నింగ్ వాకర్స్ భయాందోళనకు గురవుతున్నారు. కట్టపై ఆయా ప్రాంగణంలో విద్యుత్తు తీగలను నిర్లక్ష్యంగా వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పురపాలిక కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.
- న్యూస్‌టుడే, సూర్యాపేట సాంస్కృతికం



ఐదేళ్లుగా బురద.. తప్పని రోగాల బెడద

మండలంలోని నెమ్మికల్ పాండురంగయ్య బావి నుంచి ఆత్మకూర్(ఎస్) రోడ్డును కలిపే బజారు పొడవునా బురద నీళ్లు నిలవడంతో అస్తవ్యస్తంగా మారింది. గడిచిన ఐదేళ్లకుపైగా ఈ వీధి బురదగానే ఉంటోంది. దీంతో నిత్యం నడిచే రైతులు, మహిళలు, నివాసితులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రోజూ బురద నీళ్లలో పాదాలు తడుస్తుండటంతో ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి బురదనీరు నిల్వలేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 'పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాల అమలుకు కృషి చేస్తా'నని పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు. - ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే:



పాకురుపట్టిన నీటి ట్యాంకు

తిరుమలగిరి పురపాలికలోని 11వ వార్డులో ముత్యాలమ్మ దేవాలయం వద్ద మినీ నీటి ట్యాంకు పాకురు పట్టి అపరిశుభ్రంగా ఉంది. సమీపంలోని ప్రజలు ఈ నీటిని వివిధ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. తరచూ వర్షాలు కురుస్తున్నందున్న నీరు కలుషితమై రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రజలు రోగాల బారిన పడకముందే ట్యాంకును శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. 'వెంటనే సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తా'నని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ చెప్పారు. - తిరుమలగిరి, న్యూస్‌టుడే:



సమస్యల వలయంలో సుందరయ్యనగర్

సూర్యాపేట పురపాలిక పరిధిలోని సుందరయ్యనగర్ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. కాలనీలోని మురుగు కాల్వలు పూడికతీతకు నోచుకోవటం లేదు. కాల్వల పక్కన దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగి మురుగు కాల్వలు కనిపించకుండా ఉన్నాయి. దీనికితోడు విషసర్పాలకు నిలయంగా మారడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి పూడిక తొలగించకపోవడంతో దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోని మురుగు రోడ్లపై పారి బురదమయంగా మారి నడిచే వీలు లేకుండా ఉంటోంది. కాల్వల వెంట పిచ్చిమొక్కల కారణంగా విషసర్పాలు చేరి రాత్రి సమయంలో కాలనీవాసులు బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. వీధి దీపాలు కూడా సరిగా వెలగటం లేదు. అత్యవసరమైతే చరవాణి వెలుగులో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పుర కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. సిబ్బందితో వెంటనే శుభ్రం చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, సూర్యాపేట పురపాలిక



విశ్రాంత ఉపాధ్యాయుడి అదృశ్యం

సైదాబాద్, న్యూస్‌టుడే: వైద్య పరీక్షల కోసం సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నాగిరెడ్డి పుల్లారెడ్డి (86) ఈ నెల 8న హైదరాబాద్‌కు వచ్చారు. ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతీనగర్‌లో నివసించే కుమార్తె వద్ద ఉంటున్నారు. 22వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుమార్తె మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3089	1939
జైశ్రీరాం	3169	1566
ఐఆర్-64	1959	1786
హెచ్ఎంటీ	2869	2192
కందులు	6509	3518
పెసర	8195	4088
వేరుసెనగ	4679	4359
మినుములు	6059	6059
ఉల్వాలు	6626	6626

దివ్యాంగులు ధైర్యంతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే



తుంగతుర్తిలో దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి, న్యూస్‌టుడే: దివ్యాంగులు ఏ మాత్రం నిరుత్సాహ పడకుండా సకలాంగులకు పోటీగా భవిష్యత్తులో ముందుకు సాగాలని ఎమ్మెల్యే మందుల సామేల్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఆ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మోటార్ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు మండలాలకు చెందిన 39 మంది దివ్యాంగులకు మోటారు ట్రైసైకిళ్లను అందించి మాట్లాడారు. వాటి విలువ సుమారు 15.6 లక్షలు ఉంటుందన్నారు. సంక్షేమ శాఖ, ప్రభుత్వ సంస్థ అయిన అలింకో కంపెనీ ద్వారా దివ్యాంగులకు మోటార్ ట్రైసైకిళ్లను అందించటం అభినందనీయమన్నారు. అలింకో కంపెనీ మేనేజరు అంజన్‌శెట్టి, జిల్లా సంక్షేమాధికారి నర్సింహరావు, సీడీపీవో శ్రీజ, ఎంపీడీవో శేషుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన: మండలంలోని కొత్తగూడెం జాతీయరహదారి వెంట ఉన్న సర్వే నెంబరు10లో గల ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ గిడ్డంగుల నిర్మాణానికి కావాల్సిన స్థలం సుమారు 3 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. తహసీల్దారు దయానందరం, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సర్వేయర్ సాయికృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు.. నూతనకల్: చిల్పకుంట్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు నూతనకల్‌లో ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, గిరిదర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగమల్లు, వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ.. జాజిరెడ్డిగూడెం: అర్వపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పులిచర్ల ప్రభాకర్ తండ్రి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహారాజు, రమేష్, సైదులు, రామలింగయ్య, శ్రీనివాస్, సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధితులకు ప్రొసీడింగ్‌ల అందజేత.. నూతనకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోరుకునే ప్రభుత్వమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పేర్కొన్నారు. ఆగస్టు చివరివారంలో వచ్చిన భారీ వర్షాలకు వరదలో కొట్టుకుపోయి చనిపోయిన తొమ్మిది మంది పశువులకు, గేదెలకు నష్టపరిహారం కింద మంజూరు చేసిన ప్రొసీడింగ్‌లను బాధిత రైతులకు నూతనకల్‌లో బుధవారం అందించి మాట్లాడారు. తొమ్మిది మంది బాధితులకు రూ.4.84 లక్షలు జమచేసిన ప్రొసీడింగ్‌లు అందించారు. పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ జయసుధ, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునిత, ఏపీఎం కరుణాకర్, పశువైద్యాధికారి శంకర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడుతూ పార్టీ ఉన్నతి పెంచండి

నూతనకల్, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ పార్టీ ఉన్నతిని పెంచడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. నూతనకల్‌లో తొట్ల మల్సూర్ స్మారక భవనంలో బుధవారం పార్టీ మండల 8వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపోరాటంలో ఇటీవల మృతి చెందిన వారికి ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీల్లో ఎక్కడ పొరపాటు జరుగుతుందో గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వివరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు చెరుకు ఏకలక్ష్మి, సైదులు, గోపి, సత్యం, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



నూతనకల్: మహాసభలో మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

ఓంకార్ ఆశయాలను సాధిద్దాం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఎంసీపీఐ(యూ) పార్టీ వ్యవస్థాపకులు, ఏపూర్ ఎర్రసూర్యుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వస్థలం ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూర్‌లో బుధవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంతాపంగా ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. 1924లో ఏపూర్ గ్రామంలో జన్మించిన ఓంకార్ చిన్న వయస్సులోనే దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఆంధ్రమహాసభ పిలుపుమేరకు ఈ ప్రాంతంలో భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి, మద్దికాయల ఓంకార్, మల్లు స్వరాజ్యం సాయుధ రైతాంగ పోరాటంలో ముఖ్య భూమిక పోషించినట్లు పేర్కొన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీ టైగర్‌గా బిరుదు పొందిన ఓంకార్ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు మట్టయ్య, వెంకన్న, నజీర్, సోమన్న, కాశి, కిరణ్, హరీష్ పాల్గొన్నారు.

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మద్దికాయల ఓంకార్ ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఎన్‌రెడ్డి విగ్రహం వద్ద బుధవారం ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఓంకార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసం, పేద ప్రజల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్పనాయకుడని ఆయన సేవలను కొనియాడారు. తొలుత ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంకన్న, నజీర్, వస్కుల మట్టయ్య, పోతుగంటి కాశి, ఏపూరి సోమన్న, ఉగ్రయ్య, కోటయ్య, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కార్మికుడి కుటుంబానికి చేయూత.. నూతనకల్ గ్రామీణం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దిర్శన్‌పల్లి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు గంట పెంటయ్య కుటుంబానికి గ్రామస్థులు బుధవారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగయ్య మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పంచాయతీ కార్యాలయంలో పని చేసిన పెంటయ్య కనీస వసతులు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామస్థులందరూ వారి కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. రవిశంకర్, రామకృష్ణ, అయోధ్య, లింగయ్య, మధుసూదన్, అశోక్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత.. నాగారం: పసునూరు గ్రామానికి చెందిన చిత్తలూరి హరీశ్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. తనతో పదో తరగతి చదివిన చిన్ననాటి మిత్రులు కలిసి రూ.40వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. దిగోజు చంద్రశేఖర్, పత్తేపురం జానకిరాములు, మల్లెపాక సైదులు, చల్లా వనజ, వినీత, మల్లేశ్, సైదులు, నవీన్, సమ్మయ్య, లింగయ్య పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక.. నాగారం: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గాన్ని నాగారం మండల కేంద్రంలో బుధవారం ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షుడిగా జలగం అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు సంతోష్, కోశాధికారిగా వేముల వెంకటేశ్, సభ్యులుగా జి చంద్రశేఖర్, ఏ అరుణ్, సతీష్‌యాదవ్, శోభన్‌బాబు, గోపి, సురేశ్, భవానీ, శివకుమార్, షేక్ నజీర్‌బబు ఎన్నికయ్యారు.

సింగిల్‌విండో ఛైర్మన్ జన్మదిన వేడుకలు.. చివ్వెంల: సింగిల్‌విండో ఛైర్మన్ మారినేని సుధీర్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బండమీది చందుపట్ల ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కేక్ కోసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కుడకుడలోని ఆలేటి ఆటం అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. మారినేని యువసేన అధ్యక్షుడు కోడి రవి, కలంచర్ల శ్రీశైలం, గుయ్యం ప్రవీణ్, యర్రబోయిన శ్రీను, రవి, గుర్వయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.